# రాజకీయాలకతీతంగా సంక్షేమ ఫలాలు

- కేసీఆర్ పాలనకు ఆకర్షితులవుతున్న ప్రజలు
- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

దుగ్గొండి, అక్టోబర్ 7: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నదని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మహ్మదాపురం నుంచి 33 కుటుంబాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీతోపాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో పెద్ది సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పెద్ది వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అందిస్తున్న జనరంజక పాలనకు ప్రజలు, ప్రతిపక్షాల నేతలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో గంట శ్రీనివాస్‌రెడ్డి, రేగుల స్వామి, వంగ రవియాదవ్, సురావు కృష్ణ, రేగు లశివ, కొండ్రోజు శ్రీనివాస్, ఎద్దు శ్రీనివాస్, ఎద్దు రమేశ్, ఆడెపు సుమన్, సూచన నగేశ్, రాజేందర్, విష్ణు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింత లావణ్య-యుగేంధర్, వంగేటి అశోక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆడెపు రాజు, క్లస్టర్ బాధ్యులు పాల్గొన్నారు.


నల్లబెల్లి: బీజేపీ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పెద్ది


దుగ్గొండి: ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

### బీఆర్ఎస్‌లోకి బీజేపీ మండలాధ్యక్షుడు

నల్లబెల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యరక్తలు పార్టీలో చేరుతున్నారని ఎమెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ కన్నారావుపేట గ్రామ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డితోపాటు పలువురు పెద్ది సమక్షంలో పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, సర్పంచ్‌లు తంగెళ్ల నిర్మలా రవీందర్‌రెడ్డి, లూనావత్ వెంకన్న, పార్టీ గ్రామ అధ్యక్షుడు మాడిశెట్టి రవి, కృష్ణారెడ్డి, తండ సంపత్, రాజు, సాంబయ్య, బద్రి, రాజేందర్, ఆంజనేయులు, యశోద బుచ్చన్న, మూర్తి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్‌వో మంజుల

## క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

దుగ్గొండి, అక్టోబర్ 7: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మల్లంపల్లి కేజీబీవీ గురుకుల ప్రత్యేకాధికారి మంజుల అన్నారు. ఈ నెల 4న జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో మల్లంపల్లి కేజీబీవీ విద్యార్థిని వర్ష తన ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం వర్షను మంజుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ సుభాషిణి, అనూష, సరస్వతి, భారతి, స్రవంతి, సంధ్య, లావణ్య, కవిత పాల్గొన్నారు.


భూమిపూజలో పాల్గొన్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

## మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

ఖానాపురం, అక్టోబర్ 7: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. మనుబోతులగడ్డలో రూ. 15 లక్షలతో నిర్మిస్తున్న మహిళా సంఘం భవనానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. సీఎం కేసీఆర్ మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లెపు సోమయ్య, సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్, కొలిశెట్టి పూర్ణచందర్‌రావు, సిద్ది సత్యనారాయణ, బాలు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

### 'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

చెన్నారావుపేట, అక్టోబర్ 7: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రవిచంద్ర డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం టీఎస్ సీపీఎస్ఈయూ అత్యవసర సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు బానోత్ వెంకన్న, ప్రధాన కార్యదర్శి అజ్మీరా స్వామి, రమేశ్, పావని, రమాదేవి, యాకయ్య పాల్గొన్నారు.

### 'గృహలక్ష్మి'తో సొంతింటి కల సాకారం

నర్సంపేటరూరల్, అక్టోబర్ 7: గృహలక్ష్మీ పథకంతో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని మాజీ వైస్ ఎంపీపీ కట్ల సుదర్శన్‌రెడ్డి అన్నారు. భాంజీపేటలో శనివారం ఆయన లబ్ధిదారులకు మంజూరైన ఇండ్లకు ముగ్గుపోసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఉప్పుల భిక్షపతి, ఉపాధ్యక్షుడు బీ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి భీమగాని కుమారస్వామి, మాజీ వార్డు సభ్యుడు గొర్రె రాజన్న, నాయకులు రమేశ్, రాజు, మల్లారెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

### 'క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి'

నర్సంపేటరూరల్, అక్టోబర్ 7: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. లక్నేపల్లిలోని బిట్స్‌లో మొదటి సంవత్సరం బీ ఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థులకు శనివారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఫార్మసీ విద్య చాలా ఉన్నతమైందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్‌సుందర్, సెక్రటరీ డాక్టర్ జి.రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సలేంద్రసురేశ్, డాక్టర్ నారాయణ పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల పనుల్లో వేగం పెంచాలి

నర్సంపేటరూరల్, అక్టోబర్ 7: గురిజాలలో రూ. 1.20 కోట్లతో నిర్మిస్తున్న సీసీరోడ్ల పనుల్లో వేగం పెంచాలని సర్పంచ్ గొడిశాల మమత-సదానందంగౌడ్, ఎంపీటీసీ బండారు శ్రీలత-రమేశ్, ఉప సర్పంచ్ మంచిక హరీశ్ అన్నారు. శనివారం వారు రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు.

### ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిలుపూరి భాస్కర్



నర్సంపేటరూరల్, అక్టోబర్ 7: ఎన్ఎస్‌యూఐ నర్సంపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్వరం గ్రామానికి చెందిన చిలుపూరి భాస్కర్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు జయ్యరపు అఖిల్ శనివారం భాస్కర్‌కు నియామక పత్రం అందించారు.

## నర్సంపేట వ్యవసాయ మార్కెట్ నూతన కార్యవర్గం

నర్సంపేట, అక్టోబర్ 7: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీని శనివారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. చైర్మన్‌గా ఉద్యమకారుడు పొన్న మొగిలి, వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాలెపు రాజేశ్వరరావు, డైరెక్టర్లుగా పెరుమాండ్ల ప్రభాకర్‌రెడ్డి, మాదాసి కుమారస్వామి, తోటకూరి రాజు, వాసం కరుణ, వల్లాల కరుణాకర్, మోర్తాల రామారావు, బోడ కల్పన, షరీఫ్, వెంకటేశ్వర్లు, పెండెం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నూతన కమిటీకి ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



మొగిలి, రాజేశ్వరావు

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నల్లబెల్లి, అక్టోబర్ 7: గ్రామాల్లో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి శశికుమార్ సూచించారు. మామిండ్లవీరయ్యపల్లి, నాగరాజుపల్లిలో శనివారం మండల వైద్యాధికారులు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ కాచి వడబోసిన నీటిని తాగాలని, నీటి బిందెలు, డబ్బాలపై మూతలు పెట్టాలని, ఇంటి ఆవరణల్లో ఉన్న నీటి గుంతలను పూడ్చివేయాలని సూచించారు. ఆహారంలో ఉప్పు, కారం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నవీన్, దామోధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ నాగేశ్వరావు, ఏఎన్ఎం అనిల్, ఆశ కార్యకర్త సుకన్య పాల్గొన్నారు.

# సాకారం కానున్న దశాబ్దాల కల

- వట్టెవాగుపై రెండు చోట్ల బ్రిడ్జిల నిర్మాణం
- రూ. 40 కోట్లతో శంకుస్థాపనలు
- నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలోనూ కొనసాగనున్న రాకపోకలు
- పల్లెవాసుల్లో వెల్లివిరిస్తున్న ఆనందం

నెక్కొండ, అక్టోబర్ 7: పల్లెవాసుల దశాబ్దాల కల త్వరలోనే సాకారం కానుంది. మండలంలోని పెద్దకోర్పోలు-చిన్నకోర్పోలు, నాగారం-ఇంటికన్నె గ్రామాల మధ్య వట్టెవాగుపై బ్రిడ్జిలు లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. వట్టెవాగుపై రెండుచోట్ల బ్రిడ్జిలు నిర్మించాలంటూ ఈ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు దశాబ్దాల కాలంగా జిల్లా, రాష్ట్రస్థాయి నేతలకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. సరైన రహదారులు లేకపోవడం, వట్టెవాగుపై బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో వట్టెవాగు పరిధిలోని గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న వట్టెవాగుపై బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, ఈ విషయమై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు విన్నవించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, స్వప్న కృషి ఫలించింది. వట్టెవాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యాం, రోడ్డు నిర్మాణం.. ఇలా ఒకేచోట నిర్మించిన దాఖలాలు ఎక్కడా లేవు. అసాధ్యం అనుకున్న బ్రిడ్జిల నిర్మాణం సీఎం కేసీఆర్, మంత్రులు దయాకర్‌రావు, కేటీఆర్ సహకారంతో ఎమ్మెల్యే పెద్ది సుసాధ్యం చేశారు. చిన్నకోర్పోలు నుంచి పెద్దకోర్పోలు రోడ్డుపై 5/400 కి.మీ. వద్ద వట్టెవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 13.90 కోట్లు, చెక్‌డ్యాం నిర్మాణానికి రూ. 3.24 కోట్లు, నాగారం సమీపంలో వట్టెవాగుపై చెక్‌డ్యామ్, బ్రిడ్జి నిర్మాణానికి రూ. 18.60 కోట్లు, అలంకానిపేట నుంచి చిన్నకోర్పోలు వరకు 4.67 కిలో మీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి రూ. 3.85 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే నాగారం-ఇంటికన్నె గ్రామాల మధ్య, పెద్దకోర్పోలు-చిన్నకోర్పోలు గ్రామాల మధ్య రాకపోకలు వర్షాకాలంలోనూ సాఫీగా సాగనున్నాయి. ప్రస్తుతం చినుకు పడితే ఈ గ్రామాలు ద్వీపకల్పంలా మారుతున్నాయి. వట్టెవాగు ఉధృతితో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. తమ చిరకాల వాంఛను నెరవేరుస్తున్న ఎమ్మెల్యే పెద్ది, జడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్నకు రుణపడి ఉంటామని పెద్దకోర్పోలు సర్పంచ్ మహబూబ్‌పాషా, చిన్నకోర్పోలు సర్పంచ్ కర్ర వెంకట్‌రెడ్డి, నాగారం సర్పంచ్ జల్లె సుదర్శన్, నక్కలగుట్ట సర్పంచ్ భూక్యా అంశమ్మ అంటున్నారు.


వట్టెవాగుపై బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతం